సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 8 । జూన్ । 2025

గరిష్టం / కనిష్టం
39° / 27°

వాతావరణం
జిల్లాలో ఆదివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. సాయంత్రం వరకు వడ గాలుల తీవ్రత ఉంటుంది.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



భద్రాచలంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

- పండుగ.. త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీక
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని, పక్కన డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ముస్లింలు శనివారం భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా మసీదులు, ఈద్గాలలో ప్రార్థనలు చేశారు. మత పెద్దలు సందేశం వినిపించారు. జిల్లా కేంద్రంలో భక్తులతో ఈద్గాలు, మసీదులు కిటకిటలాడాయి. పేదలకు ఖుర్బానీ పంపిణీ చేశారు. ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, అశ్వారావుపేట, భద్రాచలం తదితర ప్రాంతాల్లో వేడుకలను ఘనంగా జరిపారు. కొత్తగూడెంలోని బోడగుట్ట ఈద్గా మైదానంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని పండుగలను కుల మతాలకు అతీతంగా జరుపుకోవడం ప్రజాస్వామ్య భారతదేశ గొప్పతనమని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్ ముస్లిం వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ ముస్లిం మైనారిటీలను ముప్పుతిప్పలు పెడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, మైనార్టీ సంఘాల నాయకులు డాక్టర్ నయీం ఖురేషి, సీపీఐ, ముస్లిం మైనార్టీ నాయకులు వాసిరెడ్డి మురళి, అన్వర్ అలీ, అమీర్ ఖాద్రీ, అయూబ్, ఇస్మాయిల్ ఖాన్, అబ్దుల్ రబ్, అబీద్ హుస్సేన్, కరీం పాషా, జావెద్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని రామయ్య మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజలు చేశారు. తొలుత తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణా న్ని శాస్త్రోక్తంగా జరిపారు. వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో భక్తులు అధికంగా వచ్చారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదల

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో గత ఏప్రిల్‌లో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ మద్దినేని పాపారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదోతరగతి పరీక్షలకు 654 మంది హాజరు కాగా 203 మంది ఉత్తీర్ణులయ్యారని, 31.04 శాతం ఉత్తీర్ణత నమోదైందని పేర్కొన్నారు. ఇంటర్‌లో 758మంది పరీక్ష రాయగా, 388 మంది పాసయ్యారని, 51.19 శాతం ఉత్తీర్ణత నమోదయిందని తెలిపారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈ నెల 12 నుంచి 18వ తేదీ లోగా వెబ్‌సైట్, మీసేవ సెంటర్లలో ఫీజుచెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రీ కౌంటింగ్ కోసం ఒక్కో సబ్జెక్ట్‌కు ఇంటర్మీడియట్‌లో రూ.400, పదో తరగతిలో రూ.350, రీ వెరిఫికేషన్ కోసం ఒక్కో సబ్జెక్ట్‌కు ఇంటర్, పదోతరగతిలో రూ.1200 చెల్లించా లని వివరించారు.

11న చండీహోమం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈ నెల 11న చండీహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్. రజనీ కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. పూజలో పాల్గొనే భక్తులు రూ. 2,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవా లని కోరారు. పూజలో సంప్రదాయ దుస్తులు మగవారు ధోతి, కండువా, మహిళలు చీర ధరించాలని సూచించారు. పూర్తి వివరాలకు 6303408458 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి డీసెట్ కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి తెలంగాణ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు(టీజీడీఈఈ సీఈటీ – డీ సెట్)లో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ జరగనుంది. ఖమ్మం డైట్ కళాశాలలో ఈనెల 9నుంచి 13వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. ఇందు కోసం నాలుగు బృందాలను నియమించారు. అర్హత సాధించిన అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ సూచించారు.

ఏజెన్సీలో ఆధునిక గ్రంథాలయం..

నిరుద్యోగులకు వరం



గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగులు

- అన్ని హంగులతో భద్రాచలంలో లైబ్రరీ
- రూ.28 లక్షలతో అదనపు హాల్ నిర్మాణం, మెటీరియల్ కొనుగోలు
- పోటీ పరీక్షలకు ప్రశాంతంగా సిద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులు

భద్రాచలం: ఏజెన్సీ నిరుద్యోగులకు అధునాతన గ్రంథాలయం అందుబాటులోకి వచ్చింది. ఐటీడీఏ అధికారులు కావాల్సినంత మెటీరియల్, చల్లదనం కోసం కూలర్లు కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఉద్యోగాలు, ఉన్నత విద్య కోసం ప్రశాంతంగా సిద్ధమయ్యే అవకాశం ఏర్పడింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన విద్యార్థులు భద్రాచలంలో ఉంటూ ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, టీటీసీ, బీఈడీ వంటి కోర్సులు చదువుతుంటారు. కోర్సుల అనంతరం ప్రభుత్వ ఉద్యోగాల కోసం సాధన చేస్తుంటారు. సుదూర ప్రాంతాలకు, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వెళ్లలేని వారికి ఇక్కడి ఐటీడీఏ గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతోంది. గతంలో పురాతన భవనంలో, చాలీచాలని వసతులతోనే ప్రిపరేషన్‌ను నెట్టుకొచ్చే వారు. లైబ్రేరియన్‌గా ఎస్‌కే జానీ బాధ్యతలు చేపట్టాక స్థానిక దాతల సహకారాలతో బెంచీలు, కుర్చీలు, ఫ్యాన్లు, కొంత మెటీరియల్ చేకూర్చారు. వీటిని సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు పోలీసు, టీచర్, గ్రూపు పరీక్షల్లో సుమారు 30 మంది ఉద్యోగాలు సాధించారు.

ఐటీడీఏ పీఓ చొరవతో..

ఏజెన్సీ నిరుద్యోగులను ప్రోత్సహించేలా భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ గ్రంథాలయ అభివృద్ధికి మరింత చొరవ తీసుకున్నారు. ఐటీడీఏ నుంచి రూ. 28 లక్షల నిధులు కేటాయించడంతో గ్రంథాలయ ప్రాంగణంలో సుమారు ఎకరం స్థలంలో విశాలమైన గది, ప్రత్యేక తరహా షెడ్, మరుగుదొడ్లు నిర్మించారు. కేవలం మూడు నెలల సమయంలోనే నిర్మాణ పనులు పూర్తికాగా, రాష్ట మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల ప్రారంభించారు. గ్రామపంచాయతీ నిధులతో కుర్చీలు, ప్యాడ్‌లు, ఫ్యాన్‌లు, కూలర్లు ఇతరత్రా వసతులు కల్పించారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచారు. వెంకటాపురం, వాజేడు, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, ఇల్లెందు, టేకులపల్లి, ములకలపల్లి, మండలాల విద్యార్థులతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చింతూరు, కూనవరం, వీఆర్‌పురం తదితర మండలాల నిరుద్యోగులు భద్రాచలంలో గదులను అద్దెకు తీసుకుని ఉంటూ గ్రంథాలయంలో 24 గంటలు ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు.

డిజిటల్ లైబ్రరీ కూడా ఏర్పాటైతే..

మారుతున్న కాలానికి అనుగుణంగా లైబ్రరీని డిజిటలైజేషన్ చేయాలని, కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, నోట్ ప్యాడ్‌లను అందుబాటులోకి తేవాలని నిరుద్యోగులు కోరుతున్నారు. దీంతో దేశంలో ఉన్న అన్ని స్టడీ సెంటర్ల మెటీరియల్ అందుబాటులోకి వచ్చి ప్రిపరేషన్ సులభతరం అవుతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న పీఓ ఆ దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రశాంతంగా ప్రిపరేషన్



మాది ఇల్లెందు. కేవలం ప్రిపరేషన్ కోసమే భద్రాచలంలో గది తీసుకుని ఉంటున్నా. అప్పుడు ఆరు బయట, అరకొర వసతుల మధ్య చదువుకునే వాళ్లం. ప్రస్తుతం అన్ని హంగులతో లైబ్రరీ అందుబాటులోకి వచ్చింది. ఇక్కడే 24 గంటలు చదువుకుంటున్నా. –గుగులోత్ మంగీలాల్, ఇల్లెందు

డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలి



పోటీ పరీక్షలు, వివిధ సెట్లకు సిద్ధమయ్యేందుకు లైబ్రరీ అనుకూలంగా ఉంది. ప్రస్తుత పరిస్థితులకు తగినట్లు డిజిటల్ లైబ్రరీగా మార్చితే మరింత ఉపయోగం జరుగుతుంది. గ్రూప్స్, సివిల్స్ ప్రిపరేషన్ తేలికవుతుంది. పీఓ సారు దృష్టి సారించాలి. –శిల్ప, భద్రాచలం

రక్షణతో.. సులువుగా..



మణుగూరులోని పీకే ఓసీ–2 గనిలో సీసీ కెమెరాలు బిగిస్తున్న సిబ్బంది

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధన..

- పూర్తిస్థాయిలో యంత్రాలు వినియోగించేలా అధికారుల చర్యలు
- సింగరేణిలో పర్యవేక్షణకు సీసీ కెమెరాల ఏర్పాటు

మణుగూరు టౌన్: సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనపై మరింత దృష్టి సారించింది. ఇప్పటికే రోజు, నెల వారీ లక్ష్యాలు, వార్షిక లక్ష్యాల సాధనకు బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీతపై ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. సంస్థ ఉన్నాధికారులు తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, గనులను సందర్శిస్తూ ఉత్పత్తి పెంపునకు కృషి చేస్తున్నారు. ఇకపై కార్యాలయం నుంచి కూడా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందు కోసం సంస్థవ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మెయింటెనెన్స్‌లో ఉన్న యంత్రాల వద్దకు తక్షణమే డంపర్‌లు పంపడం సులువు కానుంది. గనులు, డిపార్ట్‌మెంట్లలో చోరీలను కూడా నివారించవచ్చు. నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణతో ప్రమాదాలను అరికట్టడం, యంత్ర విరామ సమయం తగ్గించడం వంటి చర్యలతో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సునాయాసంగా సాధించే అవకాశం ఉంది.

ఉత్పత్తి పెంచే దిశగా...

బొగ్గు ఉత్పత్తిలో ఏటా అగ్రగామిగా నిలుస్తున్న మణుగూరు ఏరియాలో వానాకాలం అతివృష్టి అధికారులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఫలితంగా వర్షాకాలంలో ఒక్కోసారి క్వారీల్లోకి అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో అవకాశం ఉన్న రోజుల్లో ఉత్పత్తి నిరాటంకంగా కొనసాగించాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం మణుగూరులోని గనులు, డిపార్ట్‌మెంట్లలో 120 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పటిష్ట రక్షణ చర్యలు పాటించేలా, యంత్రాల విరామ సమయం తగ్గించేలా, డంపర్ల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను నిరోధించేలా సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు.

సీసీ కెమెరాల తోడ్పాటుతో...

సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా చోరీలతోపాటు మైన్‌ను పూర్తిస్థాయి పర్యవేక్షణ చేసే వీలు కలుగుతుంది. యంత్రాల విరామం తగ్గించుకునే చర్యలతోపాటు పెంచిన పనిగంటలను పూర్తిస్థాయిలో వినియోగించి ఉత్పత్తి లక్ష్యాన్ని సునాయాసంగా చేరేందుకు దోహదపడుతుంది. మారుతున్న సాంకేతికత, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో గనుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

– లక్ష్మీపతిగౌడ్, ఇన్‌చార్జి జీఎం, మణుగూరు ఏరియా

సూపర్‌వైజర్‌స్థాయి అధికారి పర్యవేక్షణలో..

గని సైట్ కార్యాలయంలోని ఓ గదిలో పెద్ద డిస్‌ప్లేను ఏర్పాటు చేసి క్వారీలోని బెంచీల్లో జరిగే ఉత్పత్తి, ఓబీ వెలికితీత ప్రక్రియను నిత్యం ఓ సూపర్‌వైజర్ స్థాయి అధికారి పర్యవేక్షించనున్నారు. గనుల్లో ఉత్పత్తి యంత్రాలు, రవాణా వాహనాలు మరమ్మతులకు గురైనపుడు సీసీ కెమెరాల ద్వారా గమనించి తక్షణమే అక్కడికి ఇతర యంత్రాలు, వాహనాలను పంపించే అవకాశం ఉంటుంది. హాల్ రోడ్లపై సాంకేతిక లోపంతో నిలిచిన డంపర్లను వెనక్కి రప్పించే వెసులుబాటు ఏర్పడనుంది. యంత్ర సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకుంటూ, ఒక బెంచ్ నుంచి మరో బెంచ్‌కి డంపర్లు ఖాళీగా తిరగకుండా, సమయం వృథా కాకుండా చర్యలు చేపట్టి ట్రిప్పులు పెంచే అవకాశం ఉంటుంది. డంపర్ల వేగ నియంత్రణ, ఎదురెదురుగా వచ్చే డంపర్లు, ఒక దాని తర్వాత మరొకటి వెళ్తున్న డంపర్లు నిబంధనల ప్రకారం వెళ్తున్నాయో లేదో కూడా తెలుసుకోవచ్చు. దీంతో వానాకాలం వచ్చే ఉత్పత్తి లోటును తగ్గించుకునే అవకాశం ఉంటుందని యాజమాన్యం భావిస్తోంది. ఉత్పత్తి లక్ష్యం సునాయాసంగా సాధించే వీలు కలుగుతుందని అధికార వర్గాలు, కార్మిక సంఘాలు భావిస్తున్నాయి.

హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి



మాట్లాడుతున్న చావా రవి

చర్ల: వేసవి సెలవులు ముగిసే లోగా ఖాళీగా ఉన్న 700 హైస్కూలు ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. శనివారం చర్లలో టీఎస్ యూటీఎఫ్ నాయకుడు రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఐదు డీఏలకు ఒక్క డీఏ మాత్రమే ఇచ్చి ప్రభుత్వం ఉద్యోగులను మభ్యపెడుతోందని ఆరోపించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అన్ని యాజమాన్యాల ఉద్యోగులకు వర్తింపజేయాలని కోరారు. పీఆర్సీ ఇప్పటికే 23 నెలలు ఆలస్యమైనందున వెంటనే నివేదిక తెప్పించుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి బి.రాజు మాట్లాడుతూ బడిబాట ముగిసే వరకు ఉపాధ్యాయుల సర్దుబాటును వాయిదా వేయాలని, మెమో 1267ను సవరించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని, తరగతికో ఉపాధ్యాయుడిని నియమించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.మురళీమోహన్, రాష్ట్ర కమిటీ సభ్యులు నంది కృష్ణ, జిల్లా కార్యదర్శి సోడె విజయ్ కుమార్, గిరిజన సంక్షేమ విభాగం కన్వీనర్ తేజావత్ బాలు, మండల ప్రధాన కార్యదర్శి ఉయిక బాలకృష్ణ, ఎం.యాదమరాజు, హిమగిరిబాబు, శ్యామల, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బార్ షాపు గుమస్తాపై నలుగురు దాడి..

పాల్వంచ: మద్యం సేవించేందుకు వెళ్లిన నలుగురు వ్యక్తులు బార్ షాపు గుమస్తా, మరో కస్టమర్‌పై దాడికి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద నవోదయ బార్ షాపునకు శనివారం సాయంత్రం మద్యం సేవించేందుకు వెళ్లిన చింతా వంశీ డబ్బులు ఇవ్వకుండా బీర్ బాటిల్ తీసుకున్నాడు. అనంతరం మరో బాటిల్ ఇవ్వాలని అక్కడి గుమస్తా వడ్డె నర్సింహారావును అడిగితే.. డబ్బులు ఇస్తేనే ఇస్తాననడంతో తాను లోకల్ అని, నువ్వు ఎక్కడి నుంచో వచ్చి ఇవ్వవా అంటు దురుసుగా ప్రవర్తించాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా.. చింతా వంశీ అతడి స్నేహితులు కిషోర్, రఘు వరణ్, మణిశంకర్‌లు కలిసి వడ్డె నర్సింహారావుతో పాటు అక్కడి మరో కస్టమర్ అయిన కిరణ్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో వారు పరార్ అయ్యారు. నర్సింహారావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యం కోసం వెళ్లిన వ్యక్తి మృతి

చుంచుపల్లి: కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్లిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఖమ్మం తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయికి చెందిన ప్రత్తిపాటి కోటేశ్వరరావు (55) వారం రోజుల క్రితం బీపీ ఎక్కువ కావడంతో విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. ఇదే క్రమంలో శనివారం ఉదయం మళ్లీ తీవ్ర సమస్య తలెత్తడంతో వైద్యులు ఖమ్మానికి రిఫర్ చేయగా అంబులెన్స్‌లో తీసుకొస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈమేరకు మృతుడి కుమారుడు శ్రీనివాసరావు చుంచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

50 పశువుల పట్టివేత..

- గోశాలకు తరలింపు



పట్టుబడిన పశువులు

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్ బస్తీ పెంకు ఫ్యాక్టరీ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 50 పశువులను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి స్టేషన్ బస్తీ నుంచి ఓ లారీలో తరలించేందుకు ఎక్కిస్తుండగా.. హిందూ ఐక్య వేదిక నేతలు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యాన దాడి చేసి లారీ డ్రైవర్‌తో పాటు పశువులు తరలిస్తున్న మోబిన్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అతర్వాత పశువులను గోశాలకు తరలించారు. కాగా, పశువులు తరలిస్తున్న వ్యక్తులు పరారయ్యారు.

ముగ్గురు విలేకరులపై కేసు

ఖమ్మంక్రైం: ఖమ్మంకు చెందిన ముగ్గురు విలేకరులపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. కారు పార్కింగ్ విషయమై ముగ్గురు విలేకరులు తనతో దౌర్జన్యంగా ప్రవర్తించారని ద్వారకానగర్‌కు చెందిన వెంకటకృష్ణ ప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. అయితే, వెంకటకృష్ణ, ఆయన కుటుంబీకులు తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని విలేకరులు ఫిర్యాదు చేయగా ఇంకో కేసు నమోదు చేశామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

గాలి, వాన బీభత్సం..

విరిగిపడ్డ చెట్లు.. ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పు

జూలూరుపాడు: మండలంలో శనివారం గాలి, వాన బీభత్సాన్ని సృష్టించింది. బలమైన ఈదురు గాలతో కూడిన భారీ వర్షం సుమారు గంటకు పైగా కురిసింది. దీంతో చెట్లు విరిగపడగా, ఇళ్ల పై కప్పు ఎగిరిపడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపడి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

- జూలూరుపాడు న్యూకాలనీలో చెట్లు విరిగిపడడంతో మూడు విద్యుత్ స్తంభాలు విరగగా.. మందా కమలాకర్ ఇంటిపై ఓ స్తంభం ఒరగడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది సుమారు నాలుగు గంటలకు పైగా శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.
- స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపాన తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా.. పోలీసులు వాటిని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.
- సురారం గ్రామానికి చెందిన మాళోత్ సురేష్‌కు చెందిన కోళ్ల ఫారమ్ షెడ్ కుప్పకూలడంతో సుమారు 4 వేల కోడి పిల్లలు చనిపోయాయి. దీంతో సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లింది.
- అదే గ్రామానికి చెందిన బానోత్ నాగరాజు, తాటి వీరయ్య, పుట్టి లాలయ్య రేకుల ఇళ్ల పైకప్పు గాలికి ఎగిరిపోయింది.
- వీరభద్రాపురం గ్రామానికి చెందిన ఆశాకార్యకర్త కల్తి గోపారత్నం, శ్రీను దంపతుల రేకుల ఇంటి పైకప్పు ఎగిరిపోవడంతో ఇంట్లోని 5 క్వింటాళ్ల బియ్యం, వంట పాత్రలు, బట్టలు తడిసి ముద్దయ్యాయి. అంతేకాక రెండు టీవీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతినడంతో సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లింది.
- వెంగన్నపాలెం, గుండెపుడి, నల్లబండబోడు, తదితర గ్రామాల్లో పలు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో పాటు చెట్లు విరిగిపడడంతో విద్యుత్‌తీగలు తెగిపడి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



జూలూరుపాడులో తల్లాడ-కొత్తగూడెం ప్రధాన రహదారిపై విరిగిపడ్డ చెట్లు



జూలూరుపాడు న్యూకాలనీలో ఇంటిపై ఒరిగిన విద్యుత్ స్తంభం



సురారంలో కుప్పకూలిన కోళ్ల ఫారమ్ షెడ్



వీరభద్రాపురంలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

కేసు నమోదు

పాల్వంచరూరల్: వేగంగా అతి నిర్లక్ష్యంగా బుల్లెట్ వాహనాన్ని నడుపుతూ మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘనటలో ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన రుసుము అశోక్‌రెడ్డి, అఖి దంపతులు శుక్రవారం రాత్రిపాల్వంచ నుంచి ఇంటికి వెళ్తున్నారు.ఈక్రమంలో రంగాపురం వద్దకురాగానే పాల్వంచ వైపు నుంచి వస్తున్నబుల్లెట్ వాహనం ఢీకొట్టడంతో భార్యాభర్తలు కిందపడి గాయపడ్డారు. చికిత్సనిమిత్తం ఖమ్మానికి తరలించగా.. క్షతగాత్రుల బంధువైన రామకోటి రెడ్డిఫిర్యాదు మేరకు బుల్లెట్ నడుపుతున్నగద్దం సంతోష్, వి.సంతోష్‌లపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై..



ఎస్‌కె యూసుఫ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వ్యక్తి అదృశ్యంపై రామవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. రామవరం సీఆర్‌పీ క్యాంపునకు చెందిన ఎస్‌కె.యూసుఫ్ (62) గత కొన్ని రోజుల నుంచి కనిపించడం లేదు. బంధువుల ఇంటికి వెళ్లి ఉంటాడని కుటుంబసభ్యులు భావించగా.. నెల రోజులైనా ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో యూసుఫ్ కుమారుడు పాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం

భద్రాచలంఅర్బన్: బూర్గంపాడు మండల పరిధి ఇరవెండి వద్ద గోదావరిలో గురువారం సారపాకకు చెందిన భోగపతి సావంత్ గల్లంతయ్యాడు. దీంతో అతడి ఆచూకీ కోసం శుక్రవారం సాయంత్రం వరకు పోలీసులు, రెస్క్యూ టీమ్ గజ ఈతగాళ్లు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈక్రమంలో శనివారం ఉదయం భద్రాచలం వద్ద గోదావరి పరిసర ప్రాంతంలో ఓ మృతదేహం ఉన్నట్లుగా సమాచారం రావడంతో పోలీసులు అక్కడకు వెళ్లి బయటకు చూడగా.. మృతదేహం పూర్తిగా పాడైపోయింది. కాగా, ఈ ఘటనపై పరిశీలించగా.. అది సావంత్ మృతదేహంగా తేలింది. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం 27వ వార్డులోని బర్లీపీట్‌లో శనివారం ఉదయం చైన్‌స్నాచింగ్ జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీపాద పద్మ తన ఇంటి ముందు పూలు కోస్తుండగా.. ద్విచక్ర వాహనంపై వచ్చిన అగంతకుడు గుడ్డతో ఆమె నోరు మూసి మెడలో ఉన్న బంగారు తాళిని లాక్కెళ్లాడు. మహిళ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. దొంగ ఆచూకీ కోసం సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని, ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

కడతేర్చిన పాతకక్షలు..

భద్రాచలంలో యువకుడి దారుణహత్య..

- పాత గొడవల కారణంగా కత్తులతో దాడి
- మృతిచెందాడని నిర్ధారించుకున్నాకే వెళ్లిన వైనం
- పోలుసులకు లొంగిపోయిన నిందితుడు



సతీష్‌ను పరీక్షిస్తున్న వైద్యుడు, (ఇన్‌సెట్) కణితి సతీష్(ఫైల్)

భద్రాచలంఅర్బన్: పాతకక్షల నెపంతో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఉదయాన్నే ఇంటికి వెళ్లి ఒక్కసారిగా దాడి చేసి కత్తులతో అతికిరాతకంగా పొడిచి మృతిచెందాడని నిర్ధారించుకున్నాకే తిరిగి వెళ్లిన ఘటన ఇది. ఇంతటి ఉదాంతమైన సంఘటన శనివారం ఉదయం భద్రాచలం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. భద్రాచలం పట్టణంలోని ఏఎస్‌ఆర్ కాలనీకి చెందిన కణితి సతీష్ (25)కు జగదీష్‌కాలనీకి చెందిన గుంజా సాయిరామ్‌కు మధ్య గడిచిన కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి వారిద్దరు భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మరోమారు గొడవపడ్డారు. ఈ గొడవ కాస్త పెద్దదై అదేరోజు రాత్రి చర్లరోడ్డులో గల భద్రాచలం సరిహద్దున ఉన్న ఓ పెట్రోల్ బంక్ వద్ద ఇరువర్గాలకు చెందిన 40 మంది కొట్లాటకు దిగే సమయాన పోలీసులు వస్తున్నారనే సమాచారంతో అక్కడి నుంచి పారిపోయారు. దీంతో అక్కడ వదిలేసి వెళ్లిన మూడు ద్విచక్ర వాహనాలను స్టేషన్ కు తరలించి పరిశీలించగా.. ఓ స్కూటీలో రెండు కత్తులు ఉన్నట్లుగా గుర్తించిన పోలీసులు వాటిని సీజ్ చేశారు.

గొడవను మనసులో పెట్టుకుని..

శుక్రవారం రాత్రి జరిగిన గొడవను మనసులో పెట్టుకున్న సాయిరామ్ శనివారం ఉదయం దాదాపు 15 మందిని తీసుకుని సతీష్ ఇంటి వెళ్లి తలుపు కొట్టి ఒక్కసారిగా అందరూ దాడికి దిగారు. ముందుగా అతడి కడుపులో కత్తితో పొడిచాక తర్వాత పీక మీద కిరాతకంగా పొడిచారు. కాగా, సతీష్ మృతి చెందాడని నిర్ధారించుకునే వరకు అతడిపై 15 మంది దాడి చేసినట్లు సమాచారం. సతీష్ మృతి చెందాడని తెలుసుకున్నాక ఘటనా స్థలం నుంచి అందరూ వెళ్లిపోగా సాయిరామ్ మాత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. మిగిలిన వారు పరారీలో ఉన్నట్లు సమాచారం. అనంతరం సతీష్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సతీష్ వృత్తిరీత్యా భద్రాచలంలో ఆటో నడుపుతుండగా.. పాత కక్షలతోనే హత్యకు గురైనట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. 15 మందిపై కేసు నమోదు చేసినట్లుగా సీఐ నాగరాజు తెలిపారు. కాగా, భద్రాచలం అర్ధరాత్రి సమయాన పోలీస్ పెట్రోలింగ్ పెంచి, పాత నేరస్తులపై నిఘా పెంచితే తప్ప ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని స్థానికులు చెబుతున్నారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సూపర్‌బజార్(కొత్తగూడెం): అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. గరీబ్‌పేటకు చెందిన నర్సింగ్ పెద్దిరాజు వివిధ ప్రాంతాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని శనివారం ఆటోలో తరలిస్తున్నాడు. ఈక్రమంలో టూటౌన్ సీఐ ప్రతాప్ ఆధ్వర్యాన త్రీ ఇన్‌క్‌లెన్స్ వద్ద పట్టుకుని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పుణ్యస్నానాల కోసం వచ్చి..

గోదావరిలో మునిగి మృతిచెందిన బాలుడు



కుమారుడి మృతదేహాన్ని ఒళ్లో పెట్టుకుని ఏడుస్తున్న తల్లి స్వప్న

భద్రాచలంఅర్బన్: గోదావరి పుణ్యస్నానాల కోసం వచ్చి ఓ బాలుడు మృత్యువాత పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ ఉప్పల్ నియోజకవర్గపరిధి రామాంతపూర్ నుంచి 13 మంది భక్తులు పట్టణంలోని భద్రాద్రి రామయ్యను దర్శించుకోవడానికి వచ్చారు. ఈనేపథ్యాన శుక్రవారం గోదావరిలో పుణ్యస్నానం చేస్తుండగా.. అఖిల్(7) అనే బాలుడు సైతం అందరితో పాటు స్నానం చేసేందుకు నదిలోకి దిగాడు. ఈక్రమంలో బాలుడు కనిపించకపోవడంతో అతడి తల్లి స్వప్న ఒక్కసారిగా అరుస్తుండడంతో స్థానికంగా ఉన్న గజ ఈతగాళ్లు అందులోకి దిగి బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 15 నిమిషాల తర్వాత అఖిల్ ఆచూకీ లభ్యమవడంతో గత ఈతగాడు ప్రసాద్ స్థానికుల సాయంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రి తీసుకెళ్లాడు. కాగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో కుమారుడు మృతదేహాన్ని ఒళ్లో పడుకోబెట్టుకొని గుండెలవిసేలా ఏడుస్తున్న హృదయవిదారకర సంఘటన అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. అఖిల్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడికి తల్లితో పాటు తండ్రి ధనంజి, అన్నయ్య ఉన్నాడు. కాగా, గోదావరిలో అధికారులు నది ఒడ్డున ఏర్పాటు చేసిన ఐరన్ ఫెన్సింగ్‌ను దాటి వెళ్తుండడంతో ఇటువంటి ఘటనలు జరుగున్నాయని స్థానిక గజ ఈతగాళ్లు చెబుతున్నారు.

మహిళా ఎస్సైతో దురుసు ప్రవర్తన



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

కల్లూరు: విధినిర్వహణలో ఉన్న కల్లూరు ఎస్‌ఐ డి.హరితతో దురుసుగా ప్రవర్తించిన ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కల్లూరు ఏసీపీ రఘు వెల్లడించారు. కల్లూరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. కల్లూరులోని చౌదరి హోటల్ వద్ద తల్లాడకు చెంది న రాయల రామారావు తదితరులు శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులో గొడవ చేస్తున్నారని యాజమాని మాగంటి బోసుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ సమయానికి వెళ్లిపోయిన రామారావు తిరిగి పలువురితో వచ్చి హోటల్ సిబ్బంది, యాజమానిని బెదిరించాడు. తనపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే హోటల్‌ను నడవనిచ్చేది లేదని హెచ్చరిస్తుండగా ఎస్‌ఐ హరిత, సిబ్బందితో వచ్చా రు. మద్యం మత్తులో ఉన్న రామారావు, ఆయన అనుచరులను పంపించే ప్రయత్నంలో ఎస్సై, సిబ్బంది విధులను ఆటంకపరుస్తూ దాడి చేశారు. ఈమేరకు ఎస్‌ఐ ఫిర్యాదుతో పది మందిపై కేసు నమోదు కాగా, ప్రధాన నిందితుడు రాయల రామారావుతో పాటు ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, రామారావుపై గతంలోనూ తల్లాడ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందని వెల్లడించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగం, కల్లూరు, పెనుబల్లి ఎస్‌ఐలు డి.హరిత, వెంకటేష్ పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య

బూర్గంపాడు: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గంపాడు మండలం ముసలిమడుగు గ్రామానికి చెందిన బోయిన రాంబాయమ్మ(69) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె శుక్రవారం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి, అక్కడ నుంచి ఖమ్మంకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త, కొడుకు, కుమార్తె ఉన్నారు. భర్త రాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.